కథ

# జాతస్య మరణం ధ్రువమ్

సురా

ఆదెమ్మ చచ్చిపోయిందని విన్న వెంటనే చాలా రోజులు పోయింతర్వాత కథ రాయాలనిపించింది. నేను ఇదివరకు తరచు కథలు రాస్తూ ఉండేవాణ్ణి. అప్పట్లో ఐడిపిఎల్‌లో ఉద్యోగం, మలక్‌పేటలో నివాసం. రోజువారి జీవితంలో ఎన్నో పాత్రలు తారసెల్లుతుండేవి. కనీసం నెలకో కథయినా రాస్తూ ఉండేవాణ్ణి. మా కంపెనీలో ఉద్యోగస్తులందరు స్వతంత్రంగా సైడ్‌బిజినెస్ మొదలెడ్తున్న రోజులవి. ఒకళ్ళిద్దరు సెటిల్ అయ్యేసరికి నాకు కూడా బిజినెస్ మీద మనసయింది. నాన్నని ఒప్పించి నా వంతు పొలం పెట్టి బాంక్ లోన్ సంపాదించి పటాన్ చెరువులో మందుల ఫ్యాక్టరీ పెట్టాను. కథకుడిగా నా జీవితం అలా ముగిసింది. మందుల వ్యాపారం కోసం ఎడతెరిపి లేకుండా ప్రయాణాలు చేస్తూ, అలసటగా ఇంటికి తిరిగి వచ్చి పత్రికలు తిరగేయడానికి కూడా తీరిక లేని జీవితానికి అలవాటు పడిపోయాను. వారం పదిరోజుల కోసారి విజయవాడ వచ్చినా జయపురం పోయి అమ్మ నాన్నలని కలవడానికి కూడా కుదిరేది కాదు. జాబులు జవాబులు రాసే అలవాటు కూడా పోయింది. వోచర్లు, చెక్కులు సంతకం చేయడానికి తప్ప ఇతరత్రా పెన్ను పట్టుకోవాల్సిన అవసరమూ రాలేదు, కోరికా కలగలేదు.

ఆ మధ్య గొడవలయిం తర్వాత మావూరెళ్ళి అమ్మ నాన్నలని ఓదార్చి విజయవాడ వచ్చి ఈ హోటల్లో దిగాను. నేను బిజినెస్ పెట్టినప్పటి నుండి విజయవాడ వచ్చినపుడల్లా ఈ హోటల్లోనే దిగడం నా కలవాటు. మా కంపెనీ ఏజెంట్ నాకు గుడివాడలో క్లాస్‌మేటు. కులం కాలం కలిసి రావడంలో ఇద్దరి మధ్య పాత పరిచయం ఇలా బలపడింది. వాడే నాకీ హోటల్‌ని పరిచయం చేసాడు. నేనీ హోటల్లో దిగిన మొదటి రోజే ఆదెమ్మని చూసాను. పేరుకి రెస్టారెంట్‌లో అంట్లు తోమడం పని, కాని ఆదెమ్మ అందరికి అన్నిటా సహాయం చేస్తూ ఉండేది. రూములు క్లీన్ చేసే బోయిస్, అటెండెంట్లు, రెస్టారెంట్‌లో సర్వర్లు, అడపాతడపా అర్ధరాత్రి డ్యూటీ

---

(* ఈ కథ రచనాకాలం జనవరి, 1989)

కొచ్చే అమ్మాయిలు, చివరికి మానేజర్‌తో సహా అందరూ ఏదో ఒక అవసరానికి ఆదెమ్మని పిలుస్తూ ఉండేవాళ్ళు. నా లాంటి రెగ్యులర్ కస్టమర్స్‌కి కూడా ఆదెమ్మని పిలవడం అలవాటయి పోయింది. విచిత్రమేమిటంటే ఇంతమందిలో ఇన్నేళ్ళుగా పాపులర్ అయిన ఆదెమ్మ గురించి నలుగురికి తెలిసింది చాలా తక్కువ. ఇరవయి ఏళ్ళ క్రితం ఈ హోటల్‌లో పనికి కుదరకముందు ఆదెమ్మ జీవితం గురించి ఎవరికీ తెలియదు. నాకు ఇప్పుడనిపిస్తుంది, అసలు పుట్టు పూర్వోత్తరాలు లేకపోవడం వల్లే ఆదెమ్మ నే రాయబోయే కథకి పాత్ర అవుతుందని నాకు స్ఫురించలేదని.

ఊరినుండి వచ్చి, బస్సుదిగి రూమ్‌కి చేరుకుని స్నానంచేసి తగలబడిన షాపుల్ని చూద్దామని బయల్దేరా క్రింద లాబీలో అప్పారావు నడిగితే తెలిసింది. ఆదెమ్మ మొన్నటి పోలీస్ ఫైరింగ్‌లో పోయిందని. వెంటనే వివరాలు తెలుసుకుందామని కృష్ణారావుగారి రూముకెళ్ళాను. ఆయన గొడవలు మొదలయిన రెండోరోజే వాళ్ళ ఊరెళ్ళాడు. ఇంకా తిరిగి రాలేదు. ఆయన జీవితంలో ఇంతకాలం సెలవు తీసుకోడం ఇదే మొదటిసారి అయింటుంది. తిరిగొచ్చి అప్పారావునేఅడిగాను.

గొడవ మొదలయిన మొదటిరోజు సాయంత్రమే హోటల్‌మీద పెద్ద గుంపు దాడిచేసింది. హోటల్లో గెస్టులు పనివాళ్ళతో సహా అందరు ఎక్కడి వాళ్ళు అక్కడ తప్పుకున్నారు. కృష్ణారావుగారు మాత్రం పోలీసులకి ఫోన్ చేస్తూ హోటల్‌ని రక్షించడానికి ప్రయాసపడ్డాడు, వ్యర్థంగా. చివరికి ఆయన కూడా వెనక దారినుండి తప్పించుకొని బయటపడ్డాడు. ఆయనతో పాటే బయటికి వచ్చి కృష్ణలంకలో తన ఇంటికి పోయింది ఆదెమ్మ. వారం రోజులు పోయింతర్వాత పరిస్థితి అదుపులోకి వచ్చింది. అందరు తిరిగి వచ్చారు. కానిఆదెమ్మ రాలేదు. మర్నాడు పోలీసులు మాత్రం వచ్చారు. గుర్తుపట్టడానికి వీల్లేకుండా ఉన్న ఒక శవం ఫోటో చూపించి ఆదెమ్మ పోయిందనే వార్త చల్లగా బయటపెట్టారు. జరిగిందేమిటంటే రెండోరోజున ఈ రోడ్డు చివర ఉన్న మూడంతస్తుల చీరల దుకాణం లూటీ జరుగుతుంటే పోలీసులు ఫైరింగ్ ఓపెన్ చేసారు. రెండు గంటలు పోయింతర్వాత అక్కడే రోడ్డుమీదే ఆదెమ్మ శవం వాళ్ళకి కన్పడింది. పక్క దుకాణంలో పనిచేసే కుర్రాడి ద్వారా ఆదెమ్మ ఈ హోటల్లో పని చేసేదని తెలిసింది. కబురు చెప్పి ఇంటివాళ్ళకి చెప్పడానికి వాళ్ళకీ హోటల్లో ఎవరూ దొరకలేదు. నాలుగు రోజులాగి శవాన్ని మార్చురీనుండి తీసి వాళ్ళే దహనం చేసేసారు - అప్పారావు తన కథనం ముగించిన వెంటనే నాకి కథ రాయాలనిపించింది.

మానేజర్ కృష్ణారావుగారి భాషలో చెప్పాలంటే ఆదెమ్మ వాళ్ళది నైజాం. వరంగల్ జిల్లా ఏటూరు నాగారం తాలుకాలో ఓమూలకి విసిరేసి నట్టుండే అల్లాపూర్ వాళ్ళ ఊరు. ఆదెమ్మ వయసెంతో ఆదెమ్మకి కూడా తెలియదు. వాళ్ళ కులపువాళ్ళెవరు ఈ ప్రాంతాల్లో లేకపోవడంతో కులమేమిటో కూడా ఇక్కడి వాళ్ళెవరికీ సరిగా తెలియదు. కాపులు బలిస్తే రెడ్లవుతారని వరంగల్‌లో నానుడి. ఆదెమ్మ రెడ్డిమాత్రం కాదు. ఉన్న అరఎకరం పొలం చెయ్యి దాటిపోయింతర్వాత మొగుడూ పెళ్ళాలిద్దరు కూలి పనికి పోతుండేవారు. బహుశా వాళ్ళ ఊళ్ళో కాపులు చిక్కి శల్యమయితే పాలి కాపు లవుతారు కాబోలు. ఏమయితేనేం కూలి పనిలో వాళ్ళకి పొద్దు గడిచేది కాదు. ఇద్దరూ బతుకు తెరువుకోసం విజయవాడ వచ్చారు. ఇక్కడే సెటిల్ అయ్యారు. మొగుడు రిక్షాలాక్కుంటే తాను ఇళ్ళల్లో పని చేసేది. అలాగే కృష్ణారావు గారింట్లో పనికి కుదిరింది. ఆదెమ్మ చురుకుతనం చూసి ఆయనే ఆదెమ్మని ఇంటినుండి హోటల్ పనికి మార్చాడు. హోటల్లో చేరిన ఏడో ఆ మరుసటి ఏడో మొగుడు తాగి తాగి చచ్చిపోయాడు. అప్పుడోసారి ఆదెమ్మ ఏడ్చినట్టుకూడా కృష్ణారావు గారికి లీలగా జ్ఞాపకం. ఆ ఏడుపుతోనే ఆదెమ్మ పుట్టింది. పుట్టినిల్లు మెట్టినిల్లు కూడా ఈ హోటల్ అయింది ఇది ఆదెమ్మ జీవిత కథ. ఈ కథ నిజమే అనడానికి కృష్ణారావుగారి మాట తప్ప ఎవరికీ ఏ ఆధారమూ లేదు.

కృష్ణారావు గారు చాలా మంచి మనిషి. వాళ్ళది కోనసీమ. తండ్రి కరణం. ఊళ్ళోనే ఉంటూ కరణీకం చేసుకోమని ఎంత చెప్పినా వినకుండా విజయవాడొచ్చి ఈ ఉద్యోగంలో స్థిరపడ్డాడు. పాతికేళ్ళుగా ఈ హోటలు మానేజర్. ఆయన చేరిన కొత్తలో ఇదో చిన్న రెస్టారెంట్. క్రమంగా అది పెరిగి పెద్దదయి రెండువందల రూములతో నాలుగు అంతస్తులతో విజయవాడలో ప్రముఖ హోటలయింది. ఆయన శ్రమ నిజాయితీ వల్లే ఇంత అభివృద్ధి జరిగిందని ఓనరుకి ఆయన మీద నమ్మకం. తమ కష్టాలు, కథలు ఓపికగా వింటాడని వర్కర్లందరికీ ఆయనంటే గౌరవం. నేను నా ఏజెంటు మిత్రుడు ఎపుడయినా డ్రింక్స్ చేస్తే మాకు కంపెనీ ఇచ్చి ఎంటర్‌టయిన్ చేస్తాడని నాకు ఆయనంటే ఇష్టం. ఓ రోజెప్పుడో ఆయన చెప్తేనే నాకు ఆదెమ్మ గురించి తెలిసింది. ఆదెమ్మ కూడా ఎక్కడో ఎపుడో పుట్టిందని, ఆదెమ్మ కూడా పూర్వ చరిత్ర అంటూ ఒకటుందని నాకు విశ్వాసం కలగడానికి కారణం కృష్ణారావు గారి వ్యక్తిత్వమేగాని ఆదెమ్మ జీవితం కాదు. అయితే అపుడు నాకీ కథ రాయాలనే ఆలోచన రాలేదు. ఇంత సాధారణమయిన జీవితం గురించి కథ రాయకూడదని రూల్

ఏమీలేదు. ఆ మాటకొస్తే దీన్ని సాగదీసి సీరియల్ నవల కూడా రాయవచ్చు. కాని నాకు ఆ ప్రతిభలేదు. పైగా నే నీ పదేళ్ళల్లో కథలు రాయడం కూడా మానేసాను.

నాకు తెలుసు, మీరంతా ఇదేం కథ అని తేలిగ్గా తీసిపారేస్తారని. మీ మనసులో ఉన్న ప్రశ్నలేమిటో కూడా నాకు బాగా తెలుసు. ఇరవయి ఏళ్ళపాటు తలలో నాలుకలా మెదులుతూ అందర్నీ ఆప్యాయంగా పలకరించే ఆదెమ్మ అకస్మాత్తుగా సంఘవ్యతిరేక శక్తిగా మారి నిజంగానే ఆ రోజు చీరల దుకాణం లూటీ చేసిందా అన్న ప్రశ్న నాలోనూ రేగింది. ఆదెమ్మ ఎలా చచ్చిపోయింది? లూటీ చేస్తుంటే గుండు దెబ్బతగిలిందా? తగలబడిన తన హోటలుని చూడ్డానికి వెళ్తుంటే ప్రమాదవశాత్తు ప్రాణం పోగొట్టుకుందా? చచ్చిపోయిన ఆదెమ్మ ఎవరు? రెడ్డి కాలేక పాలికాపయిన రైతు బిడ్డా? నైజాం నుండి విజయవాడకు బతుకు తెరువు కోసం వచ్చిన కూలి మనిషా? అందరూ అభిమానించే హోటల్ వర్కరా? కేవలం స్త్రీయా? మరణించినపుడు ఆదెమ్మ ఎవరు ఆవిడ ఐడెంటిటీ ఏమిటి అన్న ప్రశ్నలు నాకు కూడా స్ఫురించాయి. కాని నేను చెప్పదల్చుకున్నదల్లా మనల్ని వేధించే ఈ ప్రశ్నలకి జవాబులు ఈ కథకి అనవసరం అని మాత్రమే. కథకి ఆదెమ్మ మరణిస్తే చాలు. ఇంతకీ మరణించింది ఆదెమ్మేనా?

పుట్టిన ప్రతివాడు చచ్చి తీరవలసిందే అని భగవద్గీతకారుడు అన్నాడు. కాని చచ్చిన ప్రతివాళ్ళు 'ఒకప్పుడు జీవించి యుండవలెను' అని భగవంతుడు కూడా అనలేదు. ఇదెలా సాధ్యం అని ధర్మసందేహం కలిగితే కథంతా మరోసారి చదవండి. ఆదెమ్మ పుట్టుపూర్వోత్తరాల గురించి కృష్ణారావుగారి మాట, చావు గురించి పోలీసులు ఆలస్యంగా అందజేసిన కబురు తప్ప మనకే ఇతర సాక్ష్యాధారాలు లేవు. వాళ్ళ చెప్పుడు మాటలు వినకుండా నేను నేరుగా నిజా నిజాల్ని నిర్ధారణ చేసుకోవచ్చు. కాని నాకు అప్పుడీ కథ రాయడం సాధ్యమయ్యేదికాదు. జీవితాన్ని కథ కింద, మనుషుల్ని పాత్రల కింద రూపొందించే క్రమంలో హత్యలు చేయడం కథకులందరికి అలవాటే. ఎన్నో ఏళ్ళుగా సాగుతూ వస్తున్న ఈ హత్యాకాండ వల్లే మన సాహిత్యం జనాదరణని పొందింది. కథకుడిగా నా పాఠకుల మీద నేను అధికారం చెలాయించడం కోసం ఇలా హత్యలు చెయ్యడం, చేయించడం, ఎవరయినా చేస్తే ఆమోదించడం

## దక్షిణాఫ్రికా కోసం ...

నెల్సన్ మండేలా విడుదలతో దక్షిణాఫ్రికా మరోసారి సంచలన వార్త అయింది. ప్రజాపోరాటాలలో నిమగ్నమై ఉన్నవాళ్ళ నుంచి తమ ప్రాంతంలోని పోరాటాన్ని వ్యతిరేకించే వాళ్ళవరకూ అందరూ దక్షిణాఫ్రికా ప్రజాపోరాటం గురించి మాట్లాడుతున్నారు. నెల్సన్ మండేలాకు ప్రపంచం నలుమూలల నుంచీ ప్రజలూ, ప్రజా వ్యతిరేక ప్రభువులూ కూడ ఆహ్వానం పలుకుతున్నారు.

ఇంత విస్తృతి సాధించిన దక్షిణాఫ్రికా ప్రజా పోరాటం ఏమిటి?

జూలూ, బసుటో, ఖోసా, పోడో, ట్స్వానా, సోథో, షాంగాన్, త్సోంగా, వెండా తదితర ఆఫ్రికన్ తెగలకు చెందిన నేల దక్షిణాఫ్రికా. ఆ నేలమీదికి పదిహేడో శతాబ్దం మధ్యభాగంలో తరలి వచ్చారు బోయర్లు. హాలెండ్‌నుంచి డచ్ ఈస్టిండియా కంపెనీ తరఫున వ్యవసాయదారులుగా వచ్చిన బోయర్లకు వ్యతిరేకంగా స్థానిక బంటూలు వీరోచిత పోరాటాలు చేశారు పంథొమ్మిదో శతాబ్దపు తొలిరోజుల్లో ఇంగ్లీషు వాళ్ళూ ఈ భూమిమీద కన్నువేశారు. బోయర్లు, బ్రిటిషర్లు తమది కాని నేలమీద నేలకోసం యుద్ధాలు చేసుకున్నారు. బంగారం, వజ్రాల నిక్షేపాలు విస్తారంగా ఉన్న ఆ బంగారు నేలమీద స్థానికులు పరాయివాళ్ళయిపోయారు. డచ్చివాళ్ళు ఓడిపోయారు. బ్రిటిష్‌వాళ్ళు 1910లో యూనియన్ ఆఫ్ సౌత్ ఆఫ్రికా పేరుతో దేశాన్ని "రూపొందించారు"!

పందొమ్మిదో శతాబ్దమంతా డచ్చివాళ్ళకూ, ఇంగ్లీషువాళ్ళకూ వ్యతిరేకంగా బ్రహ్మాండమైన పోరాటాలు సలిపి ఓడిపోయిన స్థానికగిరిజన తెగలు ఆ శతాబ్ది చివరి రోజుల్లో రాజకీయంగా సంఘటితం కావడం ప్రారంభమైంది. ఒకవైపు ఆఫ్రికన్‌లు

---

ఒక అవసరం అని నాకు ఎప్పుడో బోధపడింది. కాని కథకుల కంటె గొప్ప ప్రతిభావంతులయిన కథకులు మనల్ని ఇప్పుడు పాలిస్తున్నారనే సత్యం మాత్రం సాక్ష్యాధారాలు లేకుండా పుట్టి చచ్చిన ఆదెమ్మ ద్వారానే నా కర్థమయింది. అందుకే ఇన్నేళ్ళు పోయింతర్వాత మళ్ళీ ఓ కథ రాసాను.

(శ్రీయుతులు దేవినేని నెహ్రూ, స్వర్గీయ వంగవీటి మోహన రంగా గార్లకి కృతజ్ఞతలతో)